కేజ్రీవాల్‌కు బెయిల్

- సీబీఐ కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- సచివాలయానికి వెళ్లొద్దు.. ఫైళ్లపై సంతకం చేయొద్దు
- కేసు గురించి బయట మాట్లాడొద్దని షరతులు
- 'పంజరంలో చిలక' అపవాదును తొలగించుకోండి
- సీబీఐకి అత్యున్నత న్యాయస్థానం కీలక సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం కేజ్రీవాల్‌కు భారీ ఉపశమనం కలిగించింది. ఇప్పట్లో విచారణ పూర్తయ్యే అవకాశం లేదని పేర్కొన్న కోర్టు.. కేజ్రీవాల్ ఆధారాలను ట్యాంపర్ చేస్తారనే వాదనను తిరస్కరించింది. సుదీర్ఘంగా నిర్బంధించడం అన్యాయంగా స్వేచ్ఛను హరించడమేనని వ్యాఖ్యానించింది. రూ.10 లక్షల పూచీకత్తు, ఇద్దరి జామీను సమర్పించాలని కేజ్రీవాల్‌ను ఆదేశించింది. కేసు గురించి బయట ఏమీ మాట్లాడవద్దని షరతు విధించింది. ఈడీ కేసులో బెయిల్ మంజూరు చేసినప్పుడు ఆయన తన కార్యాలయానికి గానీ, ఢిల్లీ సచివాలయానికి గానీ వెళ్లవద్దని, లెఫ్ట్ నెంట్ గవర్నర్ అనుమతి కోసం తప్పనిసరి అయితే తప్ప ఏ ఫైలు పైనా సంతకం చేయవద్దని కోర్టు నిబంధనలు విధించింది. ఈ షరతులు ఇప్పుడు కూడా పాటించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

అంత తొందర ఏమొచ్చింది? : జస్టిస్ ఉజ్జల్ భుయాన్

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసే తీర్పుతో ఏకీభవించిన జస్టిస్ ఉజ్జల్ భుయాన్.. ప్రత్యేకంగా 31 పేజీల తీర్పు రాశారు. సీబీఐ అరెస్టు చేసిన సమయాన్ని ఆయన తప్పుబట్టారు. ఈడీ కేసులో బెయిల్ మంజూరు చేసినప్పుడే అరెస్టు చేయడం అంటే ఆయనను నిరాశపర్చడమే సీబీఐ లక్ష్యమని పేర్కొన్నారు. 22 నెలలుగా లేని తొందర ఈడీ కేసులో బెయిల్ వచ్చినప్పుడే సీబీఐకి ఏముందనేది అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. తప్పించుకునే సమాధానాలు ఇస్తున్నారనే కారణంతో అరెస్టు చేసి, నిర్బంధాన్ని కొనసాగించడాన్ని సీబీఐ సమర్థించుకోలేదని పేర్కొన్నారు. సహకరించకపోవడం అంటే నేరాన్ని అంగీకరించడం కాదని స్పష్టం చేశారు. 'పంజరంలో చిలక' అనే భావనను సీబీఐ తొలగించుకోవాలని, స్వతంత్రంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

షరతులపైనా అభ్యంతరాలు

ఈడీ కేసులో ఇవే కారణాలతో బెయిల్ ఇచ్చిన తర్వాత కూడా కేజ్రీవాల్‌ను కస్టడీలో పెట్టడమంటే న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు విధించిన బెయిల్ షరతులపైనా తనకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పేర్కొన్నారు. ఈ షరతులు కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లకుండా, ఫైళ్లపై సంతకాలు చేయకుండా అడ్డుకుంటున్నాయని అన్నారు. అయితే, ఇది ప్రత్యేక ఈడీ కేసు కాబట్టి న్యాయపరమైన క్రమశిక్షణ వల్ల ఈ నిబంధనలపై తాను మాట్లాడటం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

ఐదు నెలల జైలు జీవితం

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనను అరెస్టు చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10 నుంచి జూన్ 1 వరకు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జూన్ 2న ఆయన మళ్లీ జైలులో లొంగిపోగా, జూన్ 20న ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కింది. బెయిల్‌ను ఈడీ సవాల్ చేయడంతో జూన్ 25న హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. జూన్ 26న ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. జూలై 12న ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సీబీఐ అప్పటికే అరెస్టు చేయడం వల్ల ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది. సీబీఐ కేసులోనూ బెయిల్ దక్కడంతో శుక్రవారం సాయంత్రం తిహార్ జైలు నుంచి ఆయన విడుదలయ్యారు.

బీజేపీకి చెంపపెట్టు

కేజ్రీవాల్‌కు బెయిల్ రావడం బీజేపీకి చెంపపెట్టు అని ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియా పేర్కొన్నారు. ఈడీ, సీబీఐని ఉపయోగించుకొని ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడానికి బీజేపీ సిగ్గుపడాలని ఆయన అన్నారు. నియంతృత్వాన్ని ఆపేయాలని సుప్రీంకోర్టు బీజేపీకి పెద్ద సందేశం ఇచ్చిందని పేర్కొన్నారు.

బెయిల్‌పై విడుదలయ్యాక మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కేజ్రీవాల్

దేశ వ్యతిరేక శక్తులపై పోరాటం కొనసాగిస్తా: కేజ్రీవాల్

జైలు నుంచి విడుదలయ్యాక కేజ్రీవాల్ మాట్లాడుతూ.. దేశాన్ని బలహీనం చేసేందుకు పనిచేస్తున్న దేశ వ్యతిరేక శక్తులతో పోరాటాన్ని కొనసాగిస్తానని పేర్కొన్నారు. 'నా కోసం ప్రార్థించిన అందరికీ ధన్యవాదాలు. నా ప్రతి రక్తపు చుక్క దేశ సేవకే అంకితం. నా జీవితంలో ఎన్నో కష్టాలను చూశాను. ప్రతిసారి దేవుడు నా వెంట ఉన్నాడు. నన్ను బలహీనం చేయాలని జైల్లో పెట్టారు, కానీ నా సంకల్పం మరింత బలోపేతమైంది.' అని ఆయన వ్యాఖ్యానించారు.

అడ్డగోలు జీఎస్టీపై ఆక్రోశం

- తమిళనాడులో రెస్టారెంట్ యజమాని ఆవేదన
- అనంతరం కేంద్ర మంత్రికి బలవంతంగా క్షమాపణ
- వ్యక్తిగత సంభాషణ వీడియోను లీక్ చేసిన బీజేపీ
- తీవ్రంగా మండిపడిన విపక్ష నేతలు, నెటిజన్లు
- విచారం వ్యక్తం చేసిన తమిళనాడు బీజేపీ చీఫ్

జీఎస్టీపై ఆవేదన వ్యక్తం చేస్తున్న శ్రీనివాసన్

కోయంబత్తూర్: ఆహార పదార్థాలపై కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) వసూలు చేస్తుండటం పట్ల తమిళనాడులో ఓ రెస్టారెంట్ యజమాని బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను వ్యక్తిగతంగా కలిసి తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు. ఈ వ్యక్తిగత సంభాషణకు సంబంధించిన వీడియోను బీజేపీ లీక్ చేయడం వివాదాస్పదంగా మారింది. దీనిపై విపక్ష నేతలు, నెటిజన్లు మండిపడటంతో తమిళనాడు రాష్ట్ర బీజేపీ శాఖ అధ్యక్షుడు అన్నామలై క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కోయంబత్తూరు జిల్లాలోని వ్యాపారులు ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఆ సమావేశంలో అన్నపూర్ణ రెస్టారెంట్ చైన్ యజమాని, తమిళనాడు హోటల్ యజమానుల సమాఖ్య చైర్మన్ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ఆహార పదార్థాలపై నానా రకాలుగా జీఎస్టీ వసూలు చేస్తుండటం వల్ల రెస్టారెంట్ల యజమానులకు ఎదురవుతున్న సమస్యలను ఏకరువు పెట్టారు. రొట్టె (బన్)లపై ఎలాంటి పన్ను విధించకపోయినప్పటికీ క్రీమ్‌తో కూడిన రొట్టెలపై 18% పన్ను విధించడాన్ని తప్పుపట్టారు. స్వీట్లపై 5%, బిస్కెట్లపై 12%, క్రీమ్ ఫిల్డ్ బన్స్‌పై 18% చొప్పున పన్ను వసూలు చేస్తుండటంపై కష్టమర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. ఆ సమావేశం ముగిశాక ఆయన వ్యక్తిగతంగా సీతారామన్‌ను కలిసి, తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు. ఆ సమయంలో కోయంబత్తూర్ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీనివాసన్ (బీజేపీ) అక్కడ ఉన్నారు. అనంతరం ఆ వ్యక్తిగత సంభాషణ వీడియోను తమిళనాడు బీజేపీ సోషల్ మీడియా సెల్ కన్వీనర్ 'ఎక్స్'లో షేర్ చేయడం దుమారాన్ని రేపింది. బీజేపీ తీరుపై కాంగ్రెస్, డీఎంకే నేతలతోపాటు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాసన్ పట్ల బీజేపీ తలబిరుసుతో అమర్యాదకరంగా వ్యవహరించిందని, ఆయనతో నిర్మలా సీతారామన్‌కు బలవంతంగా క్షమాపణ చెప్పించినట్టు కనిపిస్తున్నదని మండిపడ్డారు. జీఎస్టీలో ఉన్న లొసుగులను వివరించి, విలువైన ప్రశ్న అడిగినందుకు వ్యాపారవేత్త శ్రీనివాసన్‌ను బీజేపీ ఘోరంగా అవమానించిందని ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత సుమంత్ సీ రామన్ లాంటివారు సైతం ధ్వజమెత్తడంతో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై స్పందించారు. శ్రీనివాసన్‌కు, నిర్మలా సీతారామన్‌కు మధ్య జరిగిన వ్యక్తిగత సంభాషణ వీడియోను బీజేపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేయడంపై విచారం వ్యక్తం చేస్తూ.. శ్రీనివాసన్‌కు క్షమాపణ చెప్పారు.

పోర్ట్‌బ్లెయిర్ ఇక శ్రీ విజయపురం

న్యూఢిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవుల రాజధానిగా ఉన్న పోర్ట్‌బ్లెయిర్ నగరం పేరును శ్రీవిజయపురంగా మార్చినట్టు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించారు. దేశంలో ఇప్పటికే ఎన్నో నగరాలు, పట్టణాల పేర్లు మార్చిన కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం.. వలసపాలకుల ముద్రలు చెరిపేసే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అండమాన్ నికోబార్ దీవులకు అసమాన స్థానం ఉన్నదని అమిత్‌షా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఒకప్పుడు చోళ సామ్రాజ్యానికి నౌకా స్థావరంగా ఉన్న అండమాన్ దీవులు ఇప్పుడు భారత అభివృద్ధి, వ్యూహాత్మక ఆకాంక్షలకు కీలకమైన ప్రాంతమని తెలిపారు. అండమాన్ ద్వీప సముదాయంలో 836 దీవులు ఉన్నాయి.

పెరగనున్న వంట నూనె ధరలు

దిగుమతులపై సుంకం భారీగా పెంచిన కేంద్రం

ముంబై, సెప్టెంబర్ 13: దేశంలో వంటనూనె ధరలు పెరగనున్నాయి. ముడి, రిఫైన్డ్ వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని ఒకేసారి 20 శాతం వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో దేశంలో పామ్ ఆయిల్, సోయా నూనె, పొద్దుతిరుగుడు నూనె ధరలు పెరగనున్నాయి. ముడి సోయా, సన్‌ఫ్లవర్, పామ్ నూనెలపై ఇప్పటివరకు కస్టమ్స్ డ్యూటీ ఉండేది కాదు. ఇప్పుడు 20 శాతం కస్టమ్స్ డ్యూటీ విధించింది. గతంలో రిఫైన్డ్ పామ్ ఆయిల్, సోయా నూనె, పొద్దుతిరుగుడు నూనెపై 12.5 శాతం దిగుమతి సుంకం ఉండేది. ఇప్పుడు వీటిపై 32.5 శాతం దిగుమతి సుంకం పడనుంది. మొత్తంగా ముడి నూనెలపై సుంకం 5.5 శాతం నుంచి 27.5 శాతానికి, రిఫైన్డ్ నూనెలపై సుంకం 13.75 శాతం నుంచి 35.75 శాతానికి పెరగనుంది. ఇది సెప్టెంబర్ 14 నుంచి అమలులోకి వస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో ఈ నూనెల ధరలు పెరగడంతో పాటు డిమాండ్ తగ్గనుంది. మరోవైపు, ఉల్లిపై ఎగుమతి సుంకాన్ని కేంద్రం 40 శాతం నుంచి 20 శాతానికి తగ్గించింది.

ఎస్ఎస్‌బీ చీఫ్‌గా అమృత్ మోహన్ ప్రసాద్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి అమృత్ మోహన్ ప్రసాద్ శుక్రవారం నియమితులయ్యారు. ప్రసాద్ 1989 బ్యాచ్‌కు చెందిన ఒడిశా క్యాడర్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక డైరెక్టర్ జనరల్‌గా పని చేస్తున్నారు.

రష్యాపైకి స్టార్మ్ షాడో క్షిపణులు?

వినియోగించేందుకు ఉక్రెయిన్‌కు యూకే గ్రీన్‌సిగ్నల్!

కీవ్, సెప్టెంబర్ 13: రష్యా – ఉక్రెయిన్ యుద్ధం మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. రష్యాపై దీర్ఘ శ్రేణి క్రూయిజ్ క్షిపణులతో (స్టార్మ్ షాడో క్షిపణులు) దాడికి ఉక్రెయిన్ సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. ఈ క్షిపణుల వినియోగానికి ఉక్రెయిన్‌కు నాటో సభ్య దేశమైన యూకే అనుమతి ఇచ్చిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. యూకే, ఫ్రాన్స్ కలిసి అభివృద్ధి చేసిన ఈ క్షిపణులు 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపై కూడా దాడి చేయగలవు. ఇప్పటివరకు రష్యా – ఉక్రెయిన్ సరిహద్దు ప్రాంతాలకు ఎక్కువగా యుద్ధం పరిమితమైంది. ఈ క్షిపణుల ద్వారా రష్యా భూభాగం లోపలి ప్రాంతాల్లోని లక్ష్యాలపై దాడులు చేయాలని ఉక్రెయిన్ భావిస్తున్నది. ఇదే జరిగితే యుద్ధం తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఒకవేళ ఉక్రెయిన్ కనుక ఈ క్షిపణులు వాడితే, దానికి ఇవి సరఫరా చేసిన నాటో దేశాలు, అమెరికా, యూరోపియన్ దేశాలను కూడా యుద్ధంలోకి లాగినట్టే అవుతుందని గురువారం రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు.

రైల్లో బాలికపై లైంగిక దాడి

ప్రయాణికుల దాడిలో నిందితుడి మృతి

కాన్పూర్: రైల్లో బాలిక(11)పై రైల్వే కాంట్రాక్టు కూలీ ఒకరు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో ఆగ్రహించిన బాధితురాలి కుటుంబసభ్యులు, ప్రయాణికులు నిందితుడిపై దాడి చేయడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. మంగళవారం రాత్రి లక్నో-కాన్పూర్ మధ్య ప్రయాణిస్తున్న హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ ఘటన జరిగిందని పోలీసులు శుక్రవారం తెలిపారు. బీహార్‌కు చెందిన నిందితుడు ప్రశాంత్ కుమార్(34) బాధితురాలి కుటుంబంతో కలిసి సివన్‌లో రైలెక్కాడు. అతడు తన బెర్త్‌ను బాలికకు ఆఫర్ చేసి.. ఆమె తల్లి లేని సమయంలో ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తల్లికి తెలుపగా.. ఆమె ఈ విషయాన్ని తన కుటుంబానికి, ఇతర ప్రయాణికులకు తెలిపింది. వారంతా కోపంతో నిందితుడిని తీవ్రంగా కొట్టారు. కాన్పూర్ సెంట్రల్ స్టేషన్‌లో రైల్వే పోలీసులు నిందితుడిని కస్టడీలోనికి తీసుకొన్నారు. అతడి ఆరోగ్యం క్షీణించడంతో దవాఖానకు తరలించారు. అక్కడ అతడు మృతి చెందాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేప్‌ను ప్రతిఘటించి.. మర్మావయవాలను కోసి

నర్స్ సాహసం.. లైంగిక దాడికి యత్నించిన డాక్టర్‌కు గుణపాఠం

పాట్నా, సెప్టెంబర్ 13: తనపై జరిగిన గ్యాంగ్ రేప్ యత్నాన్ని ఓ నర్స్ సమయస్ఫూర్తితో ధైర్యంగా ఎదుర్కొన్న ఘటన బీహార్‌లో జరిగింది. గంగాపూర్‌లోని ఆర్‌బీఎస్ హెల్త్‌కేర్ సెంటర్‌లో పనిచేస్తున్న నర్స్‌పై బుధవారం రాత్రి అదే దవాఖాన అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సంజయ్ కుమార్, అతడి ఇద్దరు సహాయకులు మద్యం తాగి లైంగిక దాడికి ప్రయత్నించారు. తనను రక్షించుకోవడానికి నర్స్ వెంటనే ఓ బ్లేడ్‌తో డాక్టర్ ప్రైవేట్ భాగాలను కోసింది. ఆ తర్వాత అక్కడి నుంచి తప్పించుకొని దగ్గర్లోని పాలంలో దాక్కొని పోలీసులకు ఫోన్ చేసింది. వారు వెంటనే అక్కడకు చేరుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నర్స్‌పై లైంగిక దాడికి యత్నించే ముందు నిందితులు దవాఖానకు లోపలి వైపు తాళం వేసి సీసీ కెమెరాలను ఆఫ్ చేశారని డీఎస్పీ పాండే తెలిపారు. వారి వద్ద మద్యం ఉండటంతో నిందితులపై ప్రొహిబిషన్ చట్టం ప్రకారం కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

కోల్‌కతా జూనియర్ డాక్టర్ల లేఖ

కోల్‌కతా, సెప్టెంబర్ 13: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ దవాఖాన సంక్షోభంపై జోక్యం చేసుకోవాలని నెల రోజులకు పైగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ రాసిన నాలుగు పేజీల లేఖను వారు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌కు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాలకు కూడా పంపారు.

ఇద్దరు జవాన్ల వీరమరణం

ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో జరిగిన రెండు వేర్వేరు ఎదురు కాల్పుల ఘటనల్లో ఇద్దరు సైనికులు వీరమరణం పొందగా, ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని మోదీ శనివారం నుంచి ఇక్కడ పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు ఒక రోజు ముందు ఈ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. కిష్టార్‌లో ఇద్దరు జవాన్లు అమరులు కాగా, కథువాలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు.

బకాయిలు చెల్లించకుంటే సమ్మె

కర్ణాటక కాంగ్రెస్ సర్కారుకు ఆర్టీసీ ఉద్యోగుల హెచ్చరిక

26 వరకు ప్రభుత్వానికి గడువు

బెంగళూరు, సెప్టెంబర్ 13: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ యూనియన్లు గట్టి హెచ్చరికలు జారీ చేశాయి. తమ ఎరియర్స్ చెల్లింపులతో పాటు, ఇతర డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 27 నుంచి ఆందోళనకు దిగుతామని ఆరు యూనియన్లతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ హెచ్చరించింది. తమ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీఎస్ఆర్‌టీసీ)కి చెందిన నాలుగు యూనియన్లు ఫ్రీడమ్ పార్కులో ధర్నా నిర్వహించాయి. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎం సిద్ధరామయ్యకు అందజేశారు. ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.4,565 కోట్లు, శక్తి స్కీమ్ కింద రీయింబర్స్ చేయాల్సిన 1,346 కోట్లు, వేతన బకాయిలు, తదితరాలు 998 కోట్లు చెల్లించాలని, వేతన సవరణ కమిటీని వెంటనే వేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ నెల 26లోగా వీటిపై చర్య తీసుకోవాలని, లేకపోతే సెప్టెంబర్ 27 నుంచి నిరవధికంగా సమ్మెలోకి దిగుతామని హెచ్చరించింది.

హైజాక్ విమానంలో నా తండ్రి

1984 నాటి ఘటనను గుర్తు చేసుకున్న విదేశాంగ మంత్రి జైశంకర్

జెనీవా: విదేశాంగ మంత్రి జైశంకర్ సమస్యకు ఇరువైపులా తానే ఉన్న సంఘటనను గుర్తు చేసుకున్నారు. డిమాండ్ చేసేవారి పక్షంలోనూ, పరిష్కారాన్ని చూపించే పక్షంలోనూ తానే ఉన్న ఆ సంఘటన 1984లో జరిగినట్లు తెలిపారు. జెనీవాలో జరిగిన ఓ కార్యక్రమంలో భారత సంతతి ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. ఇటీవల విడుదలైన టెలివిజన్ సిరీస్ 'ఐసీ 814: ది కాందహార్ హైజాక్' గురించి ప్రశ్నించినపుడు ఆయన బదులిస్తూ, ఈ సిరీస్‌ను తాను చూడలేదని చెప్పారు. 1984లో ఓ విమానం హైజాక్‌కు గురైందని, అప్పట్లో తాను వెరీ యంగ్ ఆఫీసర్‌నని చెప్పారు. ఆ విమానంలో తన తండ్రి కే సుబ్రహ్మణ్యం (ఐఏఎస్ అధికారి) ఉన్నట్లు తనకు ఆ తర్వాత తెలిసిందన్నారు. ఆ విమానాన్ని హైజాకర్లు దుబాయ్ తీసుకెళ్లిపోయారని, ఎవరినీ చంపలేదని అన్నారు. ఆ సమయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కుటుంబ సభ్యుల్లోనూ, సమస్యను పరిష్కరించే బృందంలోనూ తాను ఉన్నానని చెప్పారు.

త్వరగా పెండ్లి చేసుకుని పిల్లల్ని కనండి

- యువతీ యువకులను వేడుకుంటున్న చైనా
- తగ్గుతున్న జనన రేటుపై ఆందోళన
- రిటైర్మెంట్ వయసు పెంచేందుకు ప్రణాళిక

బీజింగ్, సెప్టెంబర్ 13: తగ్గిపోతున్న జనాభా, పెరిగిపోతున్న వృద్ధుల సంఖ్యతో చైనా ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతున్నది. దీంతో యువతీ యువకులను త్వరగా పెండ్లి చేసుకోండి, పిల్లల్ని కనండి, ఆలస్యంగా రిటైర్ అవ్వండి అంటూ వేడుకుంటున్నది. యుక్త వయసులోనే యువతీ యువకులకు వివాహాలు చేయించేందుకు నేషనల్ హెల్త్ కమిషన్ (ఎన్‌హెచ్‌సీ) తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అదే సమయంలో జనాభా సంబంధిత సమస్యల నివారణకు పదవీ విరమణ వయసును క్రమంగా పెంచుకుంటూ పోవాలని ప్రణాళిక సిద్ధం చేసింది. ఇటీవల కాలంలో తగ్గుతున్న జనన రేటు ప్రభుత్వాన్ని తీవ్ర ఆందోళన పరుస్తున్నది. ప్రస్తుతం చైనాలోని నిబంధనలు ప్రకారం యువకులు 22 ఏండ్ల నిండిన తర్వాత, యువతులు 20 ఏండ్ల తర్వాత మాత్రమే వివాహం చేసుకోవాలి. అయితే పిల్లల పెంపకానికి అధిక ఖర్చు కావడం, కెరీర్‌కు సంబంధించిన లక్ష్యాలు, కొన్ని సంప్రదాయ కట్టుబాట్ల కారణంగా చాలామంది మహిళలు పిల్లలను కనడానికి సందేహిస్తున్నారు. ఈ క్రమంలో త్వరగా పెళ్లి చేసుకుని, తొందరగా పిల్లల్ని కనాలంటూ చైనా నినదించనుంది. అందులో భాగంగానే రిటైర్మెంట్ వయసును కూడా పురుషులకు 60 నుంచి 63కు, మహిళలకు 50 నుంచి 55కు ఆయా ఉద్యోగాలను బట్టి పెంచాలని యోచిస్తున్నది. దీనిని 2025లో ప్రారంభించి 2040కు పూర్తి చేయాలని ప్రణాళిక సిద్ధం చేసింది.

కావాలన్నప్పుడే వర్షం!

- వద్దనుకుంటే రాదు.. అవసరం ఉన్నప్పుడే జల్లులు
- వర్షాన్ని నియంత్రించే దిశగా శాస్త్రవేత్తల అడుగులు
- 'మిషన్ మౌసమ్'లో భాగంగా త్వరలో పరిశోధనలు
- 'క్లౌడ్ చాంబర్' ఏర్పాటు చేసి మేఘాలపై అధ్యయనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: వర్షానికి వేళాపాళా ఉండదు. అవసరం ఉన్నప్పుడు పడదు. అవసరం లేనప్పుడు కుంభవృష్టి కురుస్తుంది. అలాకాకుండా, మనకు అవసరం ఉన్నప్పుడే వర్షం కురిస్తే..! పండుగలకు, పబ్బాలకు కుర వకుండా చేయగలిగితే..! భలేగా ఉంటుంది కదూ. ఆ దిశగా భారత శాస్త్రవేత్తలు ప్రణాళిక రచిస్తున్నారు. ఇందుకు గానూ కేంద్ర మంత్రివర్గం తాజాగా ఆమోదించిన 'మిషన్ మౌసమ్'లో భాగంగా వచ్చే ఐదేండ్లలో కీలక పరిశోధనలు జరగనున్నాయి. వడగండ్లు, ఉరుములు, మెరుపులను కూడా నియంత్రించే దిశగా ఆలోచిస్తున్నారు. క్లౌడ్ సీడింగ్‌పై ప్రధానంగా పరిశోధనలు కొనసాగనున్నాయి.

క్లౌడ్ సీడింగ్ అంటే ఏంటి?

ఆకాశంలోకి కొన్ని పదార్థాలను చల్లడం ద్వారా మేఘాలను ప్రభావితం చేయడాన్ని క్లౌడ్ సీడింగ్ అంటారు. ప్రస్తుతం సిల్వర్ అయోడైడ్, పొటాషియం ఐయోడైడ్, డ్రై ఐస్(సాలిడ్ కార్బన్ డయాక్సైడ్)ను క్లౌడ్ సీడింగ్‌కు వినియోగిస్తున్నారు. క్లౌడ్ సీడింగ్ చేయడం వల్ల నీటి ఆవిరి ద్రవ జలంగా మారి వర్షం కురుస్తుంది.

వర్షాలపై వాతావరణ మార్పుల ప్రభావం

వాతావరణ మార్పులు వర్షాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అయితే అతివృష్టి లేదంటే అనావృష్టికి కారణమవుతున్నాయి. క్లౌడ్‌బరస్ట్‌ల వల్ల తక్కువ సమయంలో, తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ వర్షం కురుస్తున్న ఘటనలు ఇటీవల పెరిగిపోయాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా మేఘాల ఎత్తు పెరుగుతున్నదని, విస్తరణ తగ్గడం వల్ల కొన్ని చోట్ల ఎక్కువగా వర్షాలు పడుతున్నాయని, ఇంకొన్ని చోట్ల కరువు పరిస్థితులు తలెత్తుతున్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఉరుములు, మెరుపులు, పిడుగుపాట్లు ఎక్కువ కావడానికీ ఇదే కారణం. ఈ పరిస్థితి నియంత్రించేందుకు మేఘాలను ప్రభావితం చేసి అతివృష్టి, అనావృష్టిని నివారించాలనేది శాస్త్రవేత్తల ఆలోచన.

'మిషన్ మౌసమ్' ద్వారా ఏం చేస్తారు?

'మిషన్ మౌసమ్' కార్యక్రమంలో భాగంగా పుణేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటిరియాలజీ(ఐఐటీఎం)లో ఒక 'క్లౌడ్ చాంబర్' ఏర్పాటు చేయనున్నారు. ఇందులో క్లౌడ్ సీడింగ్ సహా మేఘాలపై పరిశోధకులు అధ్యయనం చేయనున్నారు. ఇందుకు గానూ క్లౌడ్ చాంబర్ లోపల కృత్రిమ మేఘాలు తయారు చేసి పరిశోధనలు జరుపుతామని, వర్షాలు పెంచడంతో పాటు అడ్డుకోవడానికి క్లౌడ్ సీడింగ్ ద్వారా అవకాశాలను పరిశోధిస్తామని భూవిజ్ఞాన శాస్త్ర శాఖ కార్యదర్శి డాక్టర్ రవిచంద్రన్ తెలిపారు. రానున్న ఐదేండ్లలో కృత్రిమంగా వర్షాన్ని పెంచడంతో పాటు తగ్గించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. క్లౌడ్ సీడింగ్ పద్ధతిని అమెరికా, కెనడా, చైనా, రష్యా, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఉపయోగిస్తున్నాయి.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు

నేటితో ముగింపు

న్యూఢిల్లీ: పదేండ్ల క్రితం నాటి ఆధార్ కార్డుల్లోని వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడానికి శనివారం ఆఖరు తేదీ అని ఉడాయ్ ప్రకటించింది. ఇందుకోసం వ్యక్తిగత గుర్తింపు, చిరునామా పత్రాలను అప్‌లోడ్ చేయాలని తెలిపింది. ఉడాయ్ అధికార వెబ్‌సైట్ http://myaadhar.uidai.gov.inలో ఆధార్ నం